


కవి/కవయిత్రి మిత్రులారా!
మీరూ సప్తపదులు రాయవచ్చు
అందుకోసం
సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో
చేరేందుకు గ్రూప్ అడ్మిన్
శ్రీ జి.వి.నరసింహమూర్తి(శాంతమూర్తి)
97048 67867
నెంబర్ ను సంప్రదించండి

**నా**కైనా
మీకైనా
మంచితనం మానవతా తప్పకుండా ఉండాలి
ఎవరికైనా
-కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి
బెంగళూరు

**భు**క్తి
ముక్తి
యంత్రభూతం కోరలలో నలిగిపోతున్న
మానవుల శ్రమశక్తి
-కట్టెకోల చిన నరసయ్య,
ఖమ్మం

**ఆ**పేక్ష
ఉపేక్ష
మన నడవడిపై మనమే చేసుకోవాలి సమీక్ష
**-గడ్డం దేవీప్రసాద్,** బెంగళూర్

**భూ**తాపం
శాపం
మానవాళి తమకు తామే. చేసుకున్న పాపం !
-డా: చిట్యాల రవీందర్
హైదరాబాద్

**క**ళ్ళు
ఒళ్లు
అసూయ మనసులో నిలిచిపోతే పేరుకుపోతుంది
కుళ్ళు
**-యలమర్తి అనూరాధ** ,హైదరాబాద్

**క**క్షలు
శిక్షలు
అమానవీయాలు. -నహనం, శాంతి
మానవతకు రక్షలు
-సూర్యదేవర రవికుమార్
గుంటూరు.

**ఖే**దం
ఖేదం
పొరుగువారు ఎవరితోనూ తగదు అనవసర
వివాదం.
**-కరణం హనుమంతరావు,** హైదరాబాద్

**నీ**కంటూ!
నాకంటూ! !
ఉండాలి మనిషికి జీవితంలో ఒక -తోడంటూ!!!
-మన్నవ సుధాకర్
విజయవాడ.

**నె**య్యం
వియ్యం
పొందిన నాయకులకు సామాన్యమే పదవుల
కయ్యం.
**-రావూరి నరేశ్,** సఖినేటిపల్లి.

**న**లుపు
తెలుపు
కనుపాప రంగు శాంతి సందేశపు మేల్కొలుపు
-అంకాల సోమయ్య
దేవరుప్పుల,జనగాం

**జ**నం
ప్రభంజనం
ప్రతినేతా యిదే పలుకు- ఎవరికో నీరాజనం.
-పట్నాల ఈశ్వరరావు,
విజయనగరం

**పు**ట్ట
గిట్ట
రేపటి తరానికి ఏదైనా రాసి పెట్టు!!
-జి.కె.నారాయణ (లక్ష్మిశ్రీ)
జోగులాంబ గద్వాల్ జిల్లా

**బు**ద్ధులు
సుద్దులు
చెడువైపు మరలకుండా ఎవరికివారే పెట్టుకోవాలి
హద్దులు!
-యన్.కే. నాగేశ్వరరావు, పెనుగొండ.

**న**ది
సాగునది
పారేనీరు తరతరాల మానవజాతి సంస్కృతికి
ఆధారమైనది
**-డా.పి.వి.రామ కుమార్,** గుంటూరు

**ఖ**ర్మం
మర్మం
తెలుసుకో ! నిలబెడతావు నీవు మన-
ధర్మం ! (ఖర్మం=పురుష ప్రయత్నం)
-కంభంమెట్టు గోపాలకృష్ణ , హైదరాబాదు

**ఆ**స్తికుడు
నాస్తికుడు
ఎవడైతేనేం ! వాడు తృప్తిగా ఉన్నంతకాలం
వాస్తవికుడు.
-ఉమాదేవి పోచంపల్లి గోపరాజు,
టెక్సస్ ,ఉత్తర అమెరికా

**సా**ధన
బోధన
గురునిపై గురికుదిరిన శిష్యుని మదిలో
-ఆరాధన
-విజయనగరం.

**వా**దన
రోదన
పిల్లల మొండి -దెబ్బలతో తల్లికి వేదన
-గంగరాజు పద్మజ
మలకపేట హైదరాబాద్

**ర**క్ష
శిక్ష
అల్లరి అవధులు దాటినా అమ్మెగా శ్రీరామరక్ష
-జీ యన్ వీ సత్యనారాయణ
హైదరాబాద్

**జ్ఞా**నం
విజ్ఞానం
మేధకు పదును పెడితే అంతులేని పరిజ్ఞానం...
-విజయకుమారి ముదిగొండ
విజయవాడ

**ఆ**రోగ్యము
సౌభాగ్యము
జరారుజలతో బాధపడు జీవితానికి కలుగు
వైరాగ్యము
-ఐ.వరలక్ష్మీదేవి
కర్నూలు

**వి**ఫలం
సఫలం
ఏమయినా నిరీక్షించు, వచ్చేవరకు మంచి
ప్రతిఫలం.
-డాక్టర్. షహనాజ్ బతుల్
హైదరాబాద్

**అ**రక
మెరక
సౌకర్యం కోరక చిరుజల్లుకే పెరుగును పరక.
-కరకవలస భాస్కరరాజు,
సింహాచలం,విశాఖపట్నం

**క**ను
విను
పదుగురు మెచ్చేలా పనిచేసి పదికాలాలు మను!
**-పట్నం శేషాద్రి,** హైదరాబాద్

**మా**ర్పు
ఓర్పు
మనిషి జీవితానికి కాలం ఇచ్చే తీర్పు
-రెడ్డి పద్మావతి.
పార్వతీపురం ,మన్యం జిల్లా

# 'తెలుగు ప్రముఖుల అభిమానిగా.. పుస్తకావిష్కరణ'



'తెలుగు ప్రముఖుల అభిమానిగా...' పుస్తకావిష్కరణలో వి.వి.రాఘవారెడ్డి, శైలజామిత్ర, ఓలేటి పార్వతీశం, ఆవిష్కర్త డా॥కె.వి.రామణాచారి, డా॥ఎన్. గోపి, మద్దాళి రఘురామ్, గుదిబండి వెంకటరెడ్డి, ఉషాగాయత్రి తదితరులు.

హైదరాబాద్, మే 22 : (నేటినిజం ప్రతినిధి): హృదయాన్ని తట్టిలేపేది, కదిలించేది కవిత్వం మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా॥కె.వి. రమణాచారి అన్నారు.

రవీంద్రభారతిలో గురువారం రాత్రి జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ రచించిన 'తెలుగు ప్రముఖుల అభిమానిగా...' కవితాసంపుటి ఆవిష్కరణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహిత డా॥ మద్దాళి ఉషాగాయత్రికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. డా॥ కె.వి. రమణాచారి మాట్లాడుతూ.. నగరంలోని సాంస్కృతిక సంస్థలన్నీ ఉషాగాయత్రిని సత్కరించడం ముదావహం అన్నారు. రఘురామ్ గొప్పకవిగా ఎదుగుతున్నాడని ప్రశంసించారు. ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపి అధ్యక్షోపన్యాసం చేస్తూ.. తెలుగు ప్రముఖులను గురించిన అక్షరచిత్రాలు రఘురామ్ కవితలు అన్నారు. విద్యావేత్త టి.బి.వి. అయ్యవారు కృతిని స్వీకరించారు. సాహితీవేత్త డా॥వోలేటి పార్వతీశం, రచయిత్రి శైలజామిత్ర, కాలుష్య నియంత్రణ మండలి (ఆంధ్రప్రదేశ్) పూర్వ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వి.ఎస్.ఎస్. ప్రకాశరావు మాట్లాడారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి స్వాగతం పలికారు. ప్రధాన కార్యదర్శి వి.వి. రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. అంతకుముందు గాయని డి. సురేఖామూర్తి సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది.

# చైతన్య ప్రవంతిలా చలం మ్యూజింగ్స్ పుస్తకం



సభలో ప్రసంగిస్తున్న డా॥ నాళేశ్వరం శంకరం.

హైదరాబాద్, మే 22 : (నేటినిజం ప్రతినిధి): ఒక చైతన్య ప్రవంతిలా చలం ఆలోచనధార 'చలం మ్యూజింగ్స్' పుస్తకంలో కనిపిస్తుందని ప్రముఖ సాహితీవేత్త డా॥ కాత్యాయనీ విద్మహే అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో జీవజలం చలం సాహిత్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చలం మ్యూజింగ్స్ వస్తురూపాలు అంశంపై డా॥ కాత్యాయనీ విద్మహే, డా॥సి. మృణాళిని ప్రసంగించారు. డా॥కాత్యాయనీ మాట్లాడుతూ చలం మ్యూజింగ్స్ పుస్తకంలో మనకు కనిపించేది ఆయన సమగ్ర మూర్తిమత్వమని అన్నారు. స్త్రీ పురుష సంబంధాలు, జీవన తాత్త్వికత,



చలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

సామ్యవాదం వంటి గంభీరమైన విషయాలను చర్చించారని గుర్తు చేశారు. సినిమాలు, మూఢభక్తులు, హిపోక్రేట్లను తీవ్రంగా అపహాస్యం పాలు చేశారని అన్నారు. భావోద్వేగాలతో పాటు విస్తృత విషయ పరిజ్ఞానం ఈ పుస్తకంలో కనిపిస్తాయని అన్నారు.

ఠాగూర్, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, శ్రీశ్రీ, గాంధీలపై చలం అభిమానం చలం మ్యూజింగ్స్‌లో అక్షరీకరించారని గుర్తు చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ చలం మ్యూజింగ్స్ పుస్తకంలో రచయిత అన్ని విషయాలను ప్రస్తావించారని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, డా॥నాళేశ్వరం శంకరం, సీహెచ్ ఉషారాణి, మెర్సీ మార్గరేట్, జ్వలిత, కొల్లాపురం విమల, డా॥ కొండపల్లి నీహారిణి, ఐనంపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాటి తరం వారి కథలు నేటి తరానికి
**కథల వంతెన**

*1979లో వ్రాసిన కథ*

# బతికిన చావు

కథ





**-డా॥నందిని సిధారెడ్డి**
సెల్:9440381148

"**అ**య్యా!....
అయ్య, అయ్యా..
అయ్యా, అయ్యా, అయ్యా..."
పిలుపులు!

ఆకాశం చిల్లులు పడి కురుస్తు న్నట్టు- ఒకటే పిలుపులు!

ఆ పిలుపుల్లో ఆదుర్దా ఉంది. తత్తరపాటు ఉంది.

తమ కష్టాన్ని ఏదో మేసిపోతు న్నట్టు-

నోటి దగ్గరి ముద్ద ఎవరో దోచుకుపోతున్నట్టు-

పిలుపులు! పిలుపులు! ఒకటే పిలుపులు! ప్రకృతే నోరైనట్టు-

నర్సింలు చెవుల్లో పిలుపుల రాళ్ల వాన.

కాలవ నీళ్లకు నోచుకోని ఎకరం పొలం నర్సింలుది.

'తాయ్‌బంద్'లో పాలువంచు కునేంత డబ్బుగానీ, ధైర్యంగానీ లేని నర్సింలుకు ఊరి చెరువు నీళ్లు రావు. ఆ నీళ్లు (నర్సింలు వంతువి) దొర పొలానికెళతాయ్.

మరి, నర్సింలు పొలం?

నర్సింలు కాలవలోంచి గూడేసు కోవాలి తన పొలానికి-

తనతో గూడేసి, గూడేసి కండలన్నీ కరిగిపోయిన నర్సింలు భార్య ఓరోజున 'పాడే'సుకుని వెళ్లిపోయింది.

ఇప్పుడు-

కూతురు లచ్చి ఒకవంక, నర్సింలు ఒకవంక తాళ్లు పట్టుకుని తట్టతో గూడేస్తున్న వేళ-

చెవుల్లో పిలుపుల రాళ్లవాన-

నర్సింలు గూడ ఆపేసి గడ్డెక్కి చూశాడు.

కొడుకు సెంద్రిగాడు అరుస్తో పరుగెత్తుకొస్తున్నాడు.

"అయ్యా, వాయ్యా. మన వారాసే నంత పాడయిపోతంది. ఎవ్వల్లో ఎద్దొచ్చి సేను మేత్తంది.. రాంద్రే..."

పరుగులోనే చెప్పేశాడు.

నర్సింలు చేతులు పిసుక్కుంటూ దుడ్డుకర్ర తీసుకుని చేనువైపు పరుగు తీశాడు.

నర్సింలు వెనకాల సెంద్రిగాడు-
సెంద్రిగాని వెనకాల లచ్చి-
పరుగు.. పరుగు.. పరుగు...
బలిసిన ఎద్దే!

చేను మేసేస్తుంది. సెంద్రిగాడి మనసు రేగిపోతుంది.

నర్సింలు మాత్రం చేతులో కర్ర కిందపడేసి, ఎద్దునే మాత్రం పట్టించు కోనిష్టం లేనట్టు వెనక్కి మరలాడు.

లచ్చి మరలింది అయ్య వెనకాల్నే-

సెంద్రిగాడి కిదేంటో అసలే అర్థం కాలేదు.

"ఏందే అయ్య.. ఎద్దు నేమనకుంటనే వొత్తన్నవ్?"

"అదెవల్దో ఎర్కైనా? దొరవార్ది"

సెంద్రిగాడి కింకా అర్థంకాక చూస్తున్నట్టుండి పోయాడు.

అయ్య, అక్క ఇద్దరు ఎల్లిపోయారు.

హృదయంలో వరి కర్రలు.. మేయబడుతున్న వరి కర్రలు-

ఆ కర్రలే చెట్లై లేస్తున్నట్లు..

అయ్య పడేసిపోయిన దుడ్డుకర్రను సెంద్రిగాడు తీసుకున్నాడు.

కళ్లు వంటపొయ్యిలయినట్లు-

మేస్తున్న ఎద్దు మీదికురికాడు సెంద్రిగాడు.

×××

"అయ్యా...

> "నా తమ్ముణ్ణి సంపేత్తండ్రు అయ్యో రాంద్రయ్యో, నా తమ్ముడు.. నా సెంద్రిగాడ్ని.. రాంద్రి తండ్రో.. ఉర్కి, రాంద్రయ్యో," లచ్చి తనువంతా నోరైనట్లు అరుస్తుంది."

అయ్యా.. అయ్యాయ్యా...
అయ్యాయ్యాయ్యాయ్యాయ్యా..."
పిలుపులు! అవే పిలుపులు!

చెట్లన్నీ గొడ్డలి దెబ్బల కిందపడి ఏడుస్తున్నట్టు-

ఒకటే పిలుపులు!

ఆ పిలుపుల్లో ఆదుర్దా కాదు, బాధ వుంది. తత్తరపాటు కాదు, ఏడుపు వుంది.

చీమల్ని చెప్పుకాళ్లతో నలిపేస్తున్నట్లు-

పుండు జీవితాల్ని గుండుసూదుల్తో పొడుస్తు న్నట్లు-

పిలుపులు! పిలుపులు! ఒకటే పిలుపులు

నర్సింలు చెవుల్లో రాళ్లవాన!

గూడేయటం ఆపి గడ్డెక్కి చూశాడు నర్సింలు!

తన కొడ్కు.. తన సెంద్రిగాడు. ఏడ్సుకుంట..

ఎవరు? కొడుతున్నదెవరు? ఎవరెవరెవరు?... దొర!!

తన సెంద్రిగాడ్ని దొర వారుగట్టెతో కొడుతున్నాడు.

ఊరుకుంటే సెంద్రిగాడు సచ్చిపోతాడు.

ఏం చేయాలో అర్థంకాలేదు నర్సింలుకి.

దొర నెదిరించటం.. ఊహూ..

దొర ముందు ఒక్క మాటయినా మాట్లాడలేని తను. ఉహూ, లాభం లేదు. తనెల్లి అడిగితే.. తనని కూడా తంతాడు. అబ్బో.. ఎట్ల.. ఎట్లా.. ఎట్లెట్లెట్లెట్లెట్ల..???

ఏం చేయాలో తోచట్లేదు నర్సింలుకింకా.

అప్పటికే- ఆ కత్తి నర్సింలు కర్రని లేవనీయకుండా చేసేసింది.

××

"అయ్యా..
అయ్యా.. అ..య్యా.. అ య్ య..అ,"
అవే పిలుపులు!

మెల్లగా కట్లు కదులుతున్నట్లు-

హాస్పిటల్ బెడ్లు మెల్లగా కిర్రుమంటున్నట్లు-

పిలుపులు స..న్న..గా!

ఆ పిలుపులు రాళ్లవానలా లేవు.. కనీసం తుంపరలానూ లేవు.

గ్లూకోస్ ఒక్కొక్క చుక్కే రాల్తున్నట్టు-

రోగమొచ్చి హాస్పిటల్ గడియారం మూల్గుతు న్నట్టు-

పిలుపులు!

ఎవరూ పట్టించుకోలేదు.

వినడానికి అయ్యలేదు.

చెట్‌పట్‌న నర్సొచ్చి సెంద్రిగాడ్ని తిట్టుకుంటూ వెళ్లిపోయింది.

ఆ తర్వాత కళ్లు తెరిచేసరికి అక్క తల నిమురుతోంది.

"ఏందిరా సెంద్రీ?"

"అయ్యేడీ?"

లచ్చి నోరు మూసుకుంది.

సెంద్రిగాడు మాత్రం నోరు మూసుకోలేదు.

లచ్చే తప్పనిసరై నోరు విప్పాల్సి వచ్చింది.

"నా తమ్ముణ్ణి సంపేత్తండ్రు అయ్యో రాంద్రయ్యో, నా తమ్ముడు.. నా సెంద్రిగాడ్ని.. రాంద్రి తండ్రో.. ఉర్కి, రాంద్రయ్యో," లచ్చి తనువంతా నోరైనట్లు అరుస్తుంది.

చుట్టుపక్కల వాళ్లంతా ఓ ఇరవైమందిదాకా పరిగెత్తుకొచ్చారు, చూశారు.

నర్సింలుని రెచ్చగొట్టి మనిషో కర్ర అందుకున్నారు.

పెద్దగా ఏవో కేకలేసుకుంటూ దొర మీది కురికారు.

దొర గుండు మీద కూచున్న ఇద్దరు రౌడీలకు సైగ చేశాడు. ఇద్దరూ గుండుల్లాగే ఉన్నారు.

నర్సింలు కర్ర లేవనే లేదు.

తన కొడుకునే కాదు, తనని కూడా కొడతారు.

దొర పగబడితే తనని ఈ ఊర్లో బతకనిస్తాడా?

కొడుక్కోసం.. దొరని ఎదిరించి..

రెండువందలెకరాల పొలాన్ని ఎకురంనర పొలం ఎదిరించి బతుకుతుందా.. ఆ దెబ్బలు తను భరించగలడా.. అయ్యో..

తన చిన్నప్పుడు దొర తండ్రి కొట్టిన దెబ్బలు గుర్తొచ్చాయి నర్సింలుకి.

మిగతా వాళ్ల కర్రలకి భయపడి దొర పరిగెత్తాడు.

ఆ కర్రలు-రౌడీల కత్తులకి భయపడుతున్నాయి.

ఆ కత్తులు వాళ్ల రెచ్చిన కర్రలరి భయపడుతు న్నాయి.

రెండు కత్తుల్లోంచి ఒక కత్తి నర్సింలుని కనిపెట్టింది.

చల్లారిపోయిన కర్రలాగున్న నర్సింలుని బెదిరిస్తే మిగతా కర్రలన్నీ బెదుర్తాయని ప్లాను వేసుకుంది.

ఒక కత్తి మీద కర్రలు పడుతున్నాయి.

మరో కత్తి నర్సింలు మీద పడింది.

అప్పుడు నర్సింలు కర్ర లేవబోయింది.

"అయ్య.. అయ్య మన కండ్లల్ల మన్నుకొట్టి పొయిండు. కత్తి దెబ్బలు శానవడ్డయ్. దావ్‌ఖాన రాక ముందే జీవిబోయింది."

ఇద్దరూ బిగ్గరగా ఏడ్వబోయి బిగబట్టుకు న్నారు.

"పంచ్‌నామా సేస్తమని పోలీసోళ్లు పీన్గ తీస్కపోయిండ్రు."

ఈసారి లచ్చికి ఏడుపాగలేదు.

పైన తిరగటం కోసం పెట్టిన హాస్పిటల్ ఫ్యాన్ తిరగటం లేదు.

సెంద్రిగాడి కళ్లు తిరుగుతున్నాయి.

అంతకన్నా స్పీడుగా మెదడు తిరుగుతోంది.

మాట రాలేదు. లేవబోయి పడిపోయాడు.

××

"అయ్యా..

అయ్యలూ.. అమ్మలూ..

అయ్యలమ్మలయ్యలూ.. అయ్యా.. అక్కలన్నల య్యలూ.. అయ్యా"

అవే పిలుపులు!

పదహారేళ్లు నిండి పూస్తున్నట్లు-

గుండె గట్టి చేసుకుని తుపాకీ గుండ్లవుతు న్నట్లు-

ఒకటే పిలుపులు! ధన్‌ధన్ ధనాధనా ధనా ధన్‌ధన్..

ఆ పిలుపుల్లో ధైర్యముంది. ఆక్రోశముంది. తిరుగుబాటు సందేశం వుంది. దేశం వుంది.

సెంద్రిగాడు బుద్ధులు పుస్తకాల్లో చదవలేదు. జీవితాల్లో చదువుకున్నాడు.

సెంద్రిగాడు జనాన్ని పోగుచేసి చెపుతూ పోతున్నాడు.

దొర కళ్లకింద బతకలేక ఉరిపోసుకున్న బాలి కథ చెప్పాడు.

తాయ్‌బందీ దొరకు, పటేలుకూ మధ్య జరిగిన కొట్లాటలో బలి అయిపోయిన సాయి మల్లని కథ చెప్పాడు.

తన తండ్రి కథ చెప్పాడు. తాగించి చంప బడ్డ, అనుభవించి చంపబడ్డ.. చాలా మంది కథలు చెప్పుకుపోతున్నాడు.

సెంద్రిగాడు చెపుతూ చెపుతూ..

ఎండకాలం!!

దొర ఉక్కపోత భరించలేక కిటికీ తెరిచాడు.

ఎండ మండిపోతుంది.

వడ పరుగెత్తికొచ్చి మీద పడింది.

జనం ఎండకన్నా తీవ్రంగా వుంది.

కేకలు వడకన్నా ఉధృతంగా పరుగెత్తుకొ స్తున్నాయ్-

గుమిగూడిన జనం..

ఇళ్లు మండిపోతున్నట్టు ఎండ!

జనం మంటలై వస్తున్నట్టు ఎండ!

కర్రలు.. ఎండ.. ఎండలో కర్రలు.. రగుల్తున్న కర్రలై.. చుట్టూ చూశాడు దొర.

పిలిచాడు, పిలిచాడు, అరిచాడు, అరిచాడు. గర్జించాడు.

ఎవరూ రాలేదు.

పెళ్లాన్ని పిలిచాడు. పేర్లు పెట్టి రౌడీలిద్దర్నీ పిలిచాడు.

ఎవరూ రాలేదు. కనీసం జవాబన్నా రాలేదు. దూరంగా గాజుల చప్పుడు తప్ప- పిలిచి అరిచినా, అరిచి గర్జించినా.. నిశ్శబ్దం!! జనాల అడుగులు- కర్రల అరుపులు- అడుగులు అరుపులు- బయటికిపోతే చావే ఖాయం- ఇంట్లో ఆ ఇంట్లోనే.. ఎక్కడో దాక్కోవాలి అటు.. ఇటు..అటిటెటు.. ఎటు.. ఎటెటు.. ఎక్కడెక్కడెటె టెటెటు... అయ్యో.. అయ్యో.. అయ్యయ్యయ్యయ్యో టెటెటెటు.. పెరట్లో చేద బావి పిలిచినట్లనిపించింది. ●



# ఆసక్తి

కథ

కౌశాంబీ రాజు కీర్తి సేనుని ఆస్థానంలో ఒక సైన్యాధికారి , ఒక ఆస్థాన పండితుడు , ఒక ఆస్థాన వైద్యుడు ,ఒక కోశాధికారి పదవులు అకస్మాత్తుగా ఖాళీ అయ్యాయి. రాజు ఆయా పదవులను పూరించడానికి మహా మంత్రి సలహాను అడిగాడు. అప్పుడు మహామంత్రి రాజుగారికి ఒక సలహా ఇచ్చాడు. మహారాజుకు ఆ సలహా నచ్చి వెంటనే మహామంత్రి ని దానిని అమలుచేయమన్నాడు. రాజాజ్ఞచే మహా మంత్రి ఒక భటుని పిలిచి అప్పుడే గురుకులంలో అన్నీ విద్యలు పూర్తి గావించిన నలుగురు యువకులను పంపమని ఆ గురువు గారికి ఒక లేఖ పంపాడు. గురువు గారు వెంటనే నలుగురు శిష్యులను రాజాస్థానానికి పంపించాడు. కానీ ఆ నలుగురు అన్ని విద్యలలో ఆరితేరిన వారే . వారిని ఎవరిని ఏ పదవిలో నియమించాలనేది రాజు గారికి తోచలేదు . వారిని అడిగితే " మీ ఇష్టం మహారాజా! మాకు ఏ పదవియైనా ఫరవాలేదు " అని అన్నారు. రాజు మళ్ళీ మహామంత్రి సలహాను అడిగాడు. అప్పుడు మహామంత్రి రాజు గారి చెవిలో ఒక ఉపాయాన్ని చెప్పాడు.

వెంటనే రాజు ఆ సభలోనికి అనేక వస్తువులను తెప్పించాడు. ఆ తర్వాత రాజు ఈ నలుగురు శిష్యులను పిలిచి వారికి ఇష్టం వచ్చిన ఒక వస్తువును ఎంపిక చేసుకోమని చెప్పాడు. అక్కడ అనేక వస్తువులు ఉన్నాయి. మొదటి వ్యక్తి ఒక కత్తిని తీసుకున్నాడు. రెండో వ్యక్తి ఒక పుస్తకాన్ని చేత పట్టుకున్నాడు. మూడవ అభ్యర్థి ఒక మొక్కను తీసుకున్నాడు. నాలుగవ వ్యక్తి ఒక పది రూపాయల నాణాన్ని తీసుకున్నాడు . మంత్రి అది చూసి ఆనందించి మొదటి వ్యక్తిని సైన్యాధికారిగా ,రెండవ వ్యక్తిని ఆస్థాన పండితునిగా ,మూడవవ్యక్తిని ఆస్థాన వైద్యునిగా నాలుగవ వ్యక్తిని కోశాధికారిగా ఆయా పదవుల్లో నియమించమని రాజుకు చెప్పాడు. అప్పుడు అది రాజుకు అర్థం కాక ఎందుకు అలా చేయాలని మంత్రిని ప్రశ్నించాడు.

అప్పుడు మంత్రి రాజుతో వీరి వస్తువుల ఎన్నిక ద్వారా వీరికి దేని పైన ఆసక్తి ఉందో మనకు తెలిసింది. మొదటి వ్యక్తికి పరాక్రమం అంటే ఇష్టమని ,అతని కత్తి ఎంపిక ద్వారా తెలిసింది . అందుకే అతనిని సైన్యాధ్యక్షునిగా నియమించమన్నాను. ఇక రెండవ అభ్యర్థికి పుస్తకాలు చదవడం అంటే ఇష్టమని స్పష్టమైంది. ఆస్థాన పండితునికి అది అవసరం కూడా ! అందుకే అతనిని ఆస్థాన పండితునిగా నియమించమన్నాను. ఇక మూడవ వ్యక్తికి ఆయుర్వేద మొక్కలు అంటే ఇష్టం అని తెలిసింది. తద్వారా అతనికి వైద్య విద్యపైన మక్కువ ఉందని అర్థమైంది. అట్లే నాలుగవ వ్యక్తికి పది రూపాయల నాణెం ద్వారా అతనికి డబ్బు అంటే ఇష్టమని తెలిసింది . వారు తమకున్న ఆసక్తుల చేత తమ తమ పదవులకు న్యాయం చేయగలరు . అందుకే వారిని ఆయా పదవుల్లో నియమించమని మీకు సూచించాను" అని అన్నాడు . మంత్రి తెలివికి రాజు ఎంతో సంతోషించి ఆయా అభ్యర్థులను ఆయా పదవుల్లో నియమించాడు . కొద్ది రోజుల్లోనే వారు మంత్రి ఊహించినట్లే తమ తమ పదవులకు న్యాయం చేశారు.



**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
9908554535

# మ్యాజిక్

**నే**నొక మ్యాజిక్ చేయనా..
మధ్యాహ్నం భగభగ మండే సూర్యుడ్ని
రాత్రి చల్లని చందమామలా మార్చేయనా..

నేను ఒక మ్యూజిక్ చేసేయనా
నిన్నటి రింగ రింగ రింగ రింగ రింగారే అనే పాట-
డింగు డింగు డింగరి అనే
కొంగ్రొత్త పాటగా వినిపించేయనా..

ఒంటికి పనిలేదు.. కంటికి కునుకు లేదు
సాలె పురుగు తెరలు తెరలుగా
రాత్రి పగలు తేడా తెలియక కట్టిపడేస్తోంది
ఇప్పటికైనా యాప్‌లో చూసినవన్నీ తుడిచేసి
సెల్ ఫోన్ కట్టేయనా..
ఓటీటీలో చూస్తున్న సినిమాలన్నీ ఆపి
టీవీ స్విచ్ ఆపేయనా..

నేనొక గారడీ చేసేయనా..
ఒంటి మీద బట్టలు లేని వాడికి
కవి రూపం దాల్చించి-
చెమ్కీల శాలువా మీద
శాలువాలు కప్పేయనా..!
ఆకలి వేయని వాడికీ
ఏదో మొక్కుబడి ఫంక్షన్ పెట్టి
కడుపు నొప్పి వచ్చేటట్టు కుమ్మించేయనా..
కవిత్వం ఏమైనా ఊరికినే వస్తుందా
ఎన్ని అక్షరాలతో చెబితే గాని
ఎవరో ఒకరి బుర్రలో కెక్కదు!
ఎంత మథనపెట్టి పేరిస్తే గాని
ఒక వాక్యం గుణపమై గుండెల్లో దూరి
గాయం చేయక మానదు.

కవిత్వం ఏమైనా ఊరికినే వస్తుందా..
ఎన్ని పదాలు కళ్ళతోచూసి... పెదాలతో తడిసి....
హృదయంలోకి చేరితే గాని
రూపం బొమ్మ కట్టదు!
విజ్ఞానపు గని అయ్యి సమాజాభివృద్ధి మారదు!!
కవిత్వం ఎప్పుడు రక్తాన్ని చిందించేదే కాదు-
రక్తం ఇచ్చే దాతలానూ
ప్రాణాలు ఇచ్చి నిలబెట్టక పోదు
కవిత్వం ఎప్పుడూ.. కవిత్వమే..!
'కవి'తత్వాన్ని బోధించే
విశాల భావజాల గాలమే!!



**-చలపాక ప్రకాష్**
సెల్:9247475975

# సహజమైన మణిపూసలు

బాలసాహిత్యం చదవడం, రాయడం ద్వారా విద్యార్థులలో మంచి లక్షణాలు అలవడతాయి. నేటి కాలంలో కొందరు పిల్లలు బాలసాహిత్యం చదవడమే కాదు, రచనలు కూడా చేసి అబ్బురపరుస్తున్నారు. అలా పిల్లలు రాసిన రచనలను కొందరూ ఉపాధ్యాయులు చొరవ తీసుకొని పుస్తక రూపంలో కూడా ప్రచురిస్తున్నారు. బాలలు తాము రాసిన రచనలు పుస్తకరూపంలో వచ్చినపుడు మరింత సంతోష పడతారు. వాటిని తీపి జ్ఞాపకంగా పదిల పరుచుకుబుతారు. భవిష్యత్తులో పిల్లలు మంచి రచయితలుగా, కవులుగా ఎదగడానికి బాల్యంలో రాసిన రచనలు వారికి ఎంతగానో స్ఫూర్తినిస్తాయి.

సిద్దిపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత, గాయకుడు వరుకోలు లక్ష్మయ్య కూడా గుఱ్ఱాల గొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చక్కగా పాఠ్యాంశాలు బోధిస్తూనే రచనలు చేయడంలో కూడా మెలకువలు నేర్పిస్తున్న క్రమంలో, తెలుగు సాహిత్యంలో వడిచర్ల సత్యం రూపొందించిన నూతన లఘురూప కవితా ప్రక్రియ నియమాలను నేర్పారు. ఆ నియమాలను అర్థం చేసుకొని, తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పటి నుండే ఆరేటి శిరీష చక్కని మణిపూసలు రాయడం ప్రారంభించింది.

శిరీష రాసిన మణిపూసలను "మాబడి మణి" పేరుతో చిరు పుస్తకంగా తీసుకువచ్చారు వరుకోలు లక్ష్మయ్య. అలతి అలతి పదాలతో చక్కని అంత్యప్రాసలతో అద్భుతమైన రీతిలో మణిపూసలు అల్లింది శిరీష.




-ప్రతులకు:
వరుకోలు లక్ష్మయ్య
9704865816.

సమాజంలో తాను చూసిన విషయాలను, తాను చేసిన పనులను తనకు తెలిసిన వాటిని మణిపూసలలో కూర్చింది. అందులో నుండి మచ్చుకు కొన్ని చూద్దాం.

"గంగిరెద్దులు వచ్చాయి
ఆట లెన్నో ఆడాయి
బిక్షము వేయగానే
దీవెనలను ఇచ్చినాయి!"

అంటూ తెలుగు రాష్ట్రాలలో జరుపుకునే పెద్ద పండగలలో ఒకటైన సంక్రాంతి ప్రాశస్త్యమును తెలిపే సందర్భంగా ఈ చిరు కవిత రాసింది. పండుగ రోజులలోని సంస్కృతీ సంప్రదాయాలను తెలుపుతూ ఆ రోజున చేసే పనులను, బసవన్నల ఆటల తీరును తెలిపింది.

"చదువు నాకు వచ్చింది
తెలివి కొంత పెరిగింది
అందరు నన్ను మెచ్చారు
మంచి కొలువు వచ్చింది!"

పిల్లలకు చదవడం ద్వారా జ్ఞానం పెరుగుతుందని, మంచి ఉద్యోగం సాధించవచ్చని తన తోటి పిల్లలకు చదువు ప్రాధాన్యతను తెలియ జెప్పింది.

ఏఏఎండలోన తిరగకు
కొంటె ఆటలాడకు
వడదెబ్బ తగిలినచో
ప్రాణహానియు నీకు!"

ఎండాకాలంలో పాఠశాలకు సెలవులు ఉంటాయి. సాధారణంగా పిల్లలందరూ ఇంటి వద్ద ఎండలో ఆడుతూ ఉంటారు. అలాగే స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టడం లాంటివి చేస్తారు. కానీ ఎండలో తిరగడం వలన, కొంటె ఆటలు ఆడటం వలన వడదెబ్బ తగిలి ప్రాణానికి ముప్పు ఉంటుందని హెచ్చరించింది.

"తొమ్మిది నెలలు మోసింది
అమ్మ ప్రాణం పోసింది
నాకు జన్మ నిచ్చాక
సుద్దులెన్నో నేర్పింది!"

సృష్టిలో గొప్పనైనది అమ్మ. ప్రతి కవి ఏదో ఒక సందర్భంలో అమ్మ గొప్పతనం గురించి కవితను రాస్తారు. శిరీష కూడా అమ్మ తనకు జన్మనిచ్చి ప్రాణం పోయడమే కాకుండా ఎన్నో మంచి బుద్ధులు నేర్పిందని చక్కగా తెలిపింది.

ఇలా ఇందులో శిరీష సహజ పద్ధతిలో రాసిన మణిపూసలన్నీ అందరికి అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. "మణిపూసల బాల కవిభూషణ" బిరుదు పొందిన శిరీష భవిష్యత్తులో మరిన్ని గొప్ప గొప్ప రచనలు చేయాలని ఆశిస్తూ అభినందనలు.



-కందుకూరి భాస్కర్
9703487088

# యమపాశం



-బొమ్మరాత యల్లయ్య
సెల్: 9502051996

అదో అందమైన బంగ్లా, ముఖ ద్వారానికిరుపక్కలా మెయిన్ గేటు వరకు చక్కని పూలతోట. ఈ మధ్యే బంగ్లా ఎదురు భాగాన్ని డిజైన్డ్ గ్లేజ్డ్ టైల్స్‌తో తీర్చిదిద్దడం వల్ల బంగ్లా అందం మరింత పెరిగింది. హాల్లో 'వాలుకుర్చీ'లో పేపరు చూస్తూ కూర్చున్నాడు. ఆ ఇంటి ఓనరు వామన్రావు. సమయం ఉదయం ఎనిమిది కావస్తోంది.

ఆ ఇంట్లో గేటు ముందు చిన్న ఆకారం నిల్చుంది. మసిపాతల్లాంటి చిరుగులుపడి అట్టలు కట్టిన బట్టలు, తైల సంస్కారమే కాదు తలస్నానం కూడా లేక జడలు కట్టి రాగిరంగు దాల్చిన జుట్టు, అస్థిపంజరాన్ని చర్మం అతికించినట్లుగా దేహం. దేశ పరిస్థితికి తార్కాణంగా కుడి చేతిలో ఓ సొట్టలు పడిన సత్తుగిన్నెతో నిల్చున్న ఆ ఆకారం పేరు గౌరి. అడుక్కుతినే ఓ బిచ్చగత్తె కూతురు.

ముఖం, కళ్ళూపీక్కుపోయిన ఆ పిల్ల వాలకం చూస్తూంటే అన్నంతిని వారం అయివుంటుందనిపిస్తుంది. ఓ పిడికెడు మెతుకుల కోసం ఆశగా నిల్చుందక్కడ.

అడగందే అమ్మైనా పెట్టదని తెల్సి కాస్తంత శక్తిని గొంతులోకి తెచ్చుకొని "అమ్మా!.. అమ్మా!..." అంది ఆ పక్కనే గోడ మీదున్న కాకి పిల్లొకటి "కావ్.. కావ్" అంది.

గౌరి సత్తు పల్లెంలోకి నాలుగు ఎండిన మెతుకుల్ని చూచి అది అరిచిందో, లేక ఆ బంగ్లా ఇల్లాలు ఏదైనా వేస్తుంటే నాల్గు మెతకులన్నా కొందరాలక పోతాయా అని అరుస్తుందో తెలీదు కానీ గౌరి 'అమ్మా.. అమ్మా' అన్నప్పుడల్లా ఆ కాకిపిల్ల 'కావ్.. కావ్'మంటూనే ఉంది. ఆ అరుపులు వింటున్న వామన్రావు "ఏమేవ్!,... ఏం చేస్తున్నావ్?..." అన్నాడు. ఇంట్లో ఉన్న భార్య వరలక్ష్మినుద్దేశిస్తూ..

"అబ్బబ్బ.. ఏంటో?..మీలా ఏమీ వల్లేక ఖాళీగా కూర్చున్నాననుకున్నారా?... ఇవాళ మూడో శ్రావణ శుక్రవారం గదా! పూజ గదిలో ఆ పనులవీ చూస్తున్నా.. అసలే పని తెమలక నేను చస్తుంటే మధ్యన మీ పిలుపులేమిటి".." ఏకంగా దండకమే చదివింది వరలక్ష్మి. ఆమెకి భక్తిభావం మెండు. పూజా పునస్కారాలవీ బాగా చేస్తుంది. పైగా ఏవో నోములూ, వ్రతాల వల్లే శ్రావణ మాసంలో జన్మించిందని ఆమెకు 'వరలక్ష్మి' అని తల్లిదండ్రులు నామకరణం చేశారు. 'వరలక్ష్మి' అని పేరున్నందువల్ల ఈ శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతంతో పాటు మాసంలో వచ్చే శుక్రవారాల్లో పూజాధికాలు, ప్రసాదాలు అవీ బాగా చేస్తుంది. ఇప్పుడామే అదే పనిలో బిజీగా ఉండి భర్త పిలుపుకి బైటికొచ్చి తన చిరాకును ప్రదర్శించింది.

బదులుగా వామన్రావు, "ఏం లేదు, ఎవరో అడుక్కునే పిల్లలా ఉంది.. ఏమైనా ఉంటే వేస్తావేమోనని" అన్నాడు నసుగుతూ.. "ఇంతపొద్దున్నే ఆవిడగారి కోసం ఎవరు వండి వార్చారంటూ?.. అన్నం లేదు గిన్నంలేదు వెళ్ళమనండి".. "ఇప్పుడు నీవు వండింది కాదు వేయమంది.. రాత్రిదేమైనా ఉందేమోనని అన్నా..." "ఆ..హా.. రాత్రికి మీ వాటా అన్నం అలాగే ఉంచి రేపు దానికి వేస్తాలెండి వెట'కారం' అంటిస్తూ విస్సురుగా లోనికెళ్ళింది వరలక్ష్మి. వాళ్ళంటున్నదంతా వింటున్నా గేటు పట్టుకుని నీరసంగా అక్కడే నిల్చుంది గౌరి. ఎందుకంటే అలా అన్నవాళ్ళు కూడా వెంటనే పిల్చి ఏదో ఒకటి వేసిన సందర్భాలున్నాయి. కాబట్టి ఓ నిమిషం తీరుక్కుండానే గౌరి అనుకున్నట్టే వరలక్ష్మి పరుగులాంటి నడకతో చిన్న ఇత్తడి గిన్నె నిండా ఏదో తెచ్చి గౌరి సత్తు గిన్నెలో పడేసింది. కళ్ళు చికిలిస్తూ అదేమిటో చూసింది గౌరి. అది దేవుడికి ప్రసాదంగా అర్పించిన పాయసాన్నం. అది ఆకలితో నకనకలాడుతున్న తన పాలిట మహాప్రసాదంలా అన్పించిన గౌరి కళ్ళు ఆనందంతో మెరిశాయి. అందులో కాస్తయినా తనకు దక్కుతుందని కాకిపిల్లా కూడా 'కావ్...' మంది ఓసారి.

ఆకలితో ఉన్న గౌరి పేగుల్లో ఒక్కసారి కదలిక వచ్చింది. తడారిన నోట్లోకి తీయని లాలాజలం ఊరింది. ఆకలికి ఆగలేక వెంటనే తినాలని నిర్ణయించుకుని ఆ పాయస ప్రసాదాన్ని ఆబగా అలా తింటూ కాస్త దూరంలో చింత చెట్ల క్రింద అట్టలతో కట్టిన చిన్న పాకలాంటి తన ఇంటి వైపు నడవసాగింది. ఆమె వెంటే కాకిపిల్ల చిన్నగా ఎగురుతూ రాసాగింది.

ఆకలితో గౌరి దాన్ని తింటోంది కాని ఎందుకో ఆ పాయసాన్నం అదోలా ఉంది. ఏదో వాసన కూడా వస్తోంది. ఎంతో ఆకలిగా ఉన్నా సగం తినే సరికి వికారంగా అన్పించింది. అయినా ఆకలి మంట చల్లార్చేందుకు మరో ముద్ద బలవంతంగా తిన్నది. ఇంకోంచెం ఉంది ఇహ తినడం తన వల్ల కాక దాన్ని తన వెంటే వస్తున్న కాకి పిల్లకి వేసి ఇల్లు చేసింది గౌరి.

వాంతి అయ్యేలా అన్పిస్తోంది తమాయించుకుని ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న కాసిన్ని నీళ్ళు తాగి మగతగా పడుకుంది. కాసేపటకి కళ్ళు తిరగడం, కడుపులో తిప్పడంతో భళ్ళున వాంతి చేసుకుంది. కడుపులో నొప్పి మెలిపెడ్తోంది పేగుల్నివడేస్తూ..

నాటి తరం వారి కథలు నేటి తరానికి
**కథల వంతెన**

> "ఏదో వాసన కూడా వస్తోంది. ఎంతో ఆకలిగా ఉన్నా సగం తినే సరికి వికారంగా అన్పించింది. అయినా ఆకలి మంట చల్లార్చేందుకు మరో ముద్ద బలవంతంగా తిన్నది"

తర్వాత గౌరి తల్లి సమి ఇంటి కొచ్చింది. అప్పటికే మరో రెండు సార్లు వాంతులు, విరోచనాలు చేస్తున్న గౌరి తల్లిని చూచి మరోసారి డోక్కుంది. అది గమనించిన సమ్మి ప్లాస్టిక్ కవర్లో అడుక్కొచ్చిన కాసింత అన్నాన్ని పక్కన పడేసి.. 'యాందే గౌరి!...

యావైందే!" అంది భయంతో గౌరిని వళ్ళోకి తీస్కుని. గౌరి ఏదో చెప్పబోయింది. కానీ పెదవిదాటి రాలేదు."... యాందే..

యావన్నా తిన్నవేవే!'' అడిగింది సమ్మి వారం రోజులుగా ఇద్దరూ ఏమీ తిన్లేదని ఆమెకీతెల్సు. అవునన్నట్లు తలమాత్రం ఊపి, కళ్ళ తేలేసి అపస్మారకం లోకెళ్ళింది గౌరి. కంగారు పడిన సమ్మి తోటి బిచ్చగాళ్ళ సాయంతో దూరంగా ఉన్న గవర్నమెంటు ఆసుపత్రికి గౌరిని తీస్కెళ్ళింది.

గంట తర్వాత నిదానంగా వచ్చిన డాక్టరు గౌరినేవో పరీక్షలు చేసి, "చ్ ఈ పిల్లకి ఫుడ్ పాయిజనింగ్ అయింది. అంటే పాడైపోయిన ఆహారమేదో తిన్నది. పన్నెండు గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేను" అన్నాడు. ఏదో ఇంజక్షన్ చేసి 'సెలైన్ ఎక్కిస్తూ..

గౌరి ఎవరేసిన అన్నం తిన్నదో.. ఆ అన్నంలో ఏంకల్సిందో సమ్మికేమీ అంతుపట్టడం లేదు. ఆ నిమిషం గురించి ఆలోచించడానిక్కూడా ఆమె మనసిప్పుడు స్థిమితంగా లేదు.

అరగంట గడవకముందే, అరసెలైన్ ఎక్కక ముందే ఇక్కడ గౌరి ప్రాణాలూ, అక్కడి కాకి పిల్ల ప్రాణాలు గాల్లో కల్సిపోయాయి- వారం రోజుల్నాటి పాచిపోయి, పురుగులు పడిన పాయసాన్ని 'వరలక్ష్మి' గౌరికి వేసిందనీ, అదే ఆ పిల్లపాలిట, కాకిపిల్ల పాలిట 'యమపాశం' అయిందన్న నిజాల్ని సమాధిచేస్తూ...

*(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)*

# అన్ని సాహితీ ప్రక్రియల్లో ఆరితేరిన రచయిత్రి

కవితలు, పాటలు, లేఖలు, నాటికలు, వ్యాసాలు, కథలు, గల్పికలు సమీక్షలు- సాహిత్య సకలంను కరతలా మలకం చేసికుని రాస్తున్న శ్రీమతి కలువల (తంగిరాల) వెంకట నాట లక్ష్మీ ప్రసన్నకుమారిగారు (కె.వి.ఎన్.ఎల్. ప్రసన్నకు మారి) వాణిజ్య విద్య (బి.కాం)లో పట్టభద్రురాలు. వివిధ రంగాలలో డిప్లమాలు పూర్తి చేసికుని, సిస్టర్ నివేదిక స్కూలఖ బాలాపూర్ (హైదరాబాద్)కు ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. ఆంధ్రవ ఆల్మీకిగా పేరుగాంచిన శ్రీ వావిలి కొలను సుబ్బారావు, (కడప ఒంటిమిట్టదేవాలయ జీర్ణోద్ధరణకు నడుం కట్టిన మహామహులు) వీరి ముత్తాతగారు. తండ్రిగారి తరపున రాయలసీమ, మాతృమూర్తి తరపున తెలంగాణ (షాబాద్) మెట్టింటివారి తరపున కోస్తాప్రాంతం పూర్తి అవిభక్త ఆంధ్రప్రదేశ్ వీరికి పరిచయం.

వారసత్వపు సారస్వతానుభవం, ఉపాధ్యాయురాలిగా తాను పెంచి పోషించుకున్న అభివ్యక్తి-రెంటినీ మేళవించి దొరికిన ప్రతి అనుభవాన్ని సాహిత్య కేదాలకు మళ్ళిస్తూ చక్కని సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.

వీరి 'సాహితీ సకలం' నిజంగా సాహిత్య సర్వస్వమే! 130 పేజీలలో 13 అధ్యాయాలలో తన్ను తాను మనకు పరిచయం చేసికుంటున్నారు. సంపుటిలో మొదట 6 కవితలు, పాటలున్నాయి. ఉగాదిని స్వాగతిస్తూ, అమ్మను, అతివను కీర్తిస్తూ, బతకమ్మ పండగను వివరిస్తూ మత్సరం లేని వత్సరం (ఆశల ఉగాది) కోరుతున్నారు. ఆకాశంలో సగం కాదు, అవని అంతా అతివే (నిర్భరత్వం) అంటున్నారు. దశాబ్దాల క్రితమే జనవాక్యంగా కాంగ్రెసుకు గుణపాఠాలు చెప్పారు. ఆత్మకథ, యాత్రాచరిత్రలతో తన ఆలోచనల్ని,




ప్రతులకు: తెలంగాణ పబ్లికేషన్స్
హైదరాబాద్ మరియు
శ్రీమతి కె.వి.ఎన్.ఎల్.ప్రసన్న కుమారి
సెల్: 9492430137

అంతరంగాన్ని మనతో పంచుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తిలోని బోధనానుభవాన్ని రంగరించి చక్కగా కన్నులకు కట్టించారు. పూరీ దగ్గరి సముద్ర తీరాన (నా యాత్రా చరిత్ర) 'వీర కర్ణుడి (సూర్యుడి) పితృహృదయాన్ని' చూసి సముద్రంలానే ఉప్పొంగారట! వీరివచో చాతుర్యానికి మరో ఉదాహరణ. "అనుభవరసికో విజానాతి విద్వత్తు పరిశ్రమం" అన్న సంస్కృత నానుడిని 'జ్ఞానిని జ్ఞానే గుర్తు పట్టగలడు' (పే.35) అంటారు ప్రసన్నకుమారిగారు. 'స్వీయ చరిత్ర అనగానే కేవలం నాది మాత్రమే కాదు. నా తండ్రి తల్లి భర్త కుటుంబాల జీవనం ఉండాలంటున్న స్వీయాత్మ కథ కన్నులకు కట్టించారు.

తంగిరాల నారింట అడుగుపెట్టి, సుప్రసిద్ధ కవి, రచయిత జర్నలిస్టు శ్రీ తంగిరాల చక్రవర్తిగారి చేయిపట్టి తనకు తాను గొప్పగా మలుచుకున్న ఈ అధ్యాపక రచయిత్రి. జ్ఞానపీట అవార్డు గ్రహీత, మహాకవి, పద్మభూషణ్ డా॥సి. నారాయణరెడ్డిగారి స్మృత్యంజలిగా రూపొందించిన "అక్షర బాటసారి"ని సమీక్షిస్తూ- "ఎక్కడో కరీంనగర్ జిల్లాలోని హనుమాజీపేటలో పుట్టి సాహితీ రంగంలో ఉన్నత శిఖరాల నధిరోహించి, రాజ్యసభ సభ్యులై ఈ దేశ అత్యున్నత పద్మ పురస్కారాలు పొందటం కవిలోకానిక ఎంతైనా స్ఫూర్తిదాయకం" అని వినుతిస్తారు ప్రసన్నకుమారిగారు.

నిగర్వి, అందరితో పాలతో నీళ్ళలా కలిసి పోతూ, పబ్లిసిటీకి ఎంత మాత్రమూ పాకులాడని తన జీవిత సహచరులు శ్రీ తంగిరాల చక్రవర్తి (పూర్తిపేరు శ్రీ తంగిరాల గణేశ, శ్రీనివాస నాగేంద్ర చక్రవర్తిగారిని ప్రస్తావిస్తూ "మా మామగారికిలాగే వీరికి తగిన గుర్తింపు, అవార్డులు రాలేదని నా భావన. సాహిత్య సృజన సజీవం, అవార్డులు నిర్జీవం...

చక్రవర్తి ఓ కమిటెడ్ రైటర్ అని నా భావన. గర్వపడతాను ఇప్పటికీ" (స్వీయాత్మకథ- పే55) అంటారు. తంగిరాల చక్రవర్తిగారిని ఎరిగిన వారందరి అభిప్రాయం ఇదే! తన జీవిత భాగస్వామి సాహితీయానం గురించి చెప్పిన ఈ ఒక్క వాక్యం పదిపేజీల పెట్టు!

జన్మనిఇచ్చన అమ్మ అందరికీ పూజ్యురాలు. రచయిత్రి తన తల్లికి ఈ అపూర్వ సంకలనాన్ని అంకితమివ్వటం ఎంతో సముచితం. సాహితీవేత్తలే కాదు, సామాన్యులకూ ఈ 'సాహితీ సకలం' ఎంతో ఉపయోగకరం. రచయిత్రికి అభినందన పూర్వక వందనాలు.



– కూర చిదంబరం
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు

# బాలల నీతి కథల తోట "నక్షత్ర కోట"

వృత్తిరీత్యా హిందీ ఉపాధ్యాయుడైన బైతి దుర్గమ్ గారు పిల్లల కోసం 14 నీతి కథలతో కూడుకున్న కథా సంకలనం "నక్షత్ర కోట." ప్రస్తుత కాలంలో మారుతున్న పరిస్థితులను అవగాహన చేసుకొని, పరిపూర్ణంగా రాసినటువంటి కథల సంకలనం ఇది. విలక్షణమైన కథలతో మంచి నీతిని తెలియజేస్తూ పాఠకులను ఆద్యంతం ఆసక్తికరంగా చదివించేలా కథలు ఉన్నాయి.

నిజాయితీ, రాముల్ సార్ బడి, కోదూరు బడి కొలువుల గుడి

కోతిరాయబారం నచ్చిన మనిషి, నిజాయితీ లాంటి కథలు చాలా బాగున్నాయి.

పర్యావరణం పరిరక్షించాలి, చెట్లను నాటాలి అంటూ నీతిని తెలియజేసే కథ ఆలోచింప జేస్తుంది. అంతేకాకుండా స్వార్థం మనిషికి పనికిరాదు అని మరో కథలో రచయిత తెలియజేశారు. మద్యపానం వల్ల కలిగే నష్టాలు ఉన్న కుటుంబాలను నాశనం చేస్తాయి అంటూ మాస్టారు ప్రేరణ ద్వారా చెప్పిన నీతి చాలా బాగుంది

ప్రతి ఒక కథ ఆణిముత్యంగా చెప్పుకోవచ్చు. ప్రతి కథలో దేని ప్రత్యేకత దానికే ఉంది. నిజానికి పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు కూడా చదవాలనే కోరిక కలగడం గొప్ప విషయం.

బాలల కోసం బైతి దుర్గమ్ గారు ఇలాంటి కథలను మరెన్నో రాయాలని కోరుకుంటూ అభినందనలు శుభాకాంక్షలు

నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు వారిలో మంచి క్రమశిక్షణ సత్ ప్రవర్తన సమాజం పట్ల చక్కటి అవగాహన మొదలగు

ఇతివృత్తాలతో కూడుకొని రచయిత రాయడం నిజంగా అభినందనీయం.

ఇందులో మొత్తం పేజీల సంఖ్య 40.వెల 50 రూపాయలు.పుస్తకం ముఖ చిత్రం అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడింది.




– బైతి తార
9959007914



-యాదవరం సహస్ర
8వ తరగతి
శ్రీ చైతన్య స్కూల్
సిద్దిపేట

# భావ, సాహిత్య కవి డాక్టర్ ఎస్ ఏ రవూఫ్.

-కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్



సభలో ప్రసంగిస్తున్న అదిథులు.

హైదరాబాద్, మే 22 : (నేటినిజం ప్రతినిధి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ సుప్రసిద్ధ విమర్శకులు సుదర్శనం అన్నట్లు డాక్టర్ రవూఫ్ రచనల్లో పద్య నిర్మాణంలో సహజత్వంతో, రమణీయంగా, ఆలోచనలను రేకిస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొనారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక బృందావన్ గార్డెన్స్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయం ఆవరణలో ప్రముఖ రచయిత డాక్టర్ రవూఫ్ కలం నుండి జాలువారిన డాక్టర్ కవితా సంపుటి జాబిల్లి పుష్పం పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేసిన డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ కవి తన కవిత్వం ద్వారా తాను చెప్పదలుచుకున్న భావాలను సూటిగా హృదయాలను తాకే టట్లు ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుప్రసిద్ధ కవి డాక్టర్ ఇస్మాయిల్ వారసునిగా గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ ప్రస్థానంలో డాక్టర్ రవూఫ్ ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ తన కలం ద్వారా కవిత్వాన్ని సృష్టిస్తే అది రసజ్ఞుల హృదయాల లోతులను సృజిస్తాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలుగా డాక్టర్ చిల్లర భవానీ దేవి మాట్లాడుతూ కవితా సంపుటి జాబిల్లి పుష్పం లో జాబిల్లి అనేకానేక శాఖల పుష్పంగా మారి గుబాళి స్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని పలువురు రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు







## ఎండలు

ఎండలు బాబోయ్ ఎండలు
శలవులు బాబోయ్ శలవులు
పిల్లలు బాబోయ్ పిల్లలు
తోడైతే ఒకరికి ముగ్గురు
ఇక ఇల్లు పీకి పందిరే!



-డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

పుస్తక సమీక్షలు

# ప్రశ్నిద్దాం- నిలువరిద్దాం- 'చివరిదాక'

కమ్మల నర్సిములు ఆదిలాబాద్ అందించిన మరో తాజా కవి. సామాజిక స్పృహతో రాసే కవుల జాబితాల్లో నర్సిములు కూడా చేరినట్లే! గతంలో కమ్మల నిజవాక్కులు, అమ్మ మాట- అయ్యబాట, నానీలు ప్రచురించారు. కరోనా కాలంలో పుట్టిన కవితలుగా చెప్పబడుతున్నా, కవి, తాను 21 మంది ఐ.ఎ.ఎస్. ఆఫీసర్స్ వద్ద పనిచేసిన 42 సంవత్సరాల రెవెన్యూ సర్వీసులో, తటస్థపడిన బడుగు, బలహీనుల కష్టాలు చూసి, చలించిన నర్సిములు తన కలానికి పనిచెప్పి ఇందులో ఈ 'చివరిదాక' అంటూ కవితల పుస్తకాన్ని మనకు అందించారు. కవితలకు పెట్టిన మకుటాలు చదివితేనే మనకు అర్థం కాగలదు మన నర్సిములుగారి కలం ఏ దారిలో పయనించిందో, మోసాల మొలకలు, మతమేది, కులమేది, అడవిపోయే పులివచ్చె, అబద్దాల కోరు, దిగజారిన రాజకీయం, నేటినిజం, నేటి రాజకీయం, ఆగమైన పానం, రాలిన తారా వంటి కవితల్లో ఎంత ఆవేదన చెందారో కవి మనకు ఇట్టే అర్థమవుతుంది. మొదటి కవిత 'మట్టి మనిషిలో అన్నదాత కష్టాలను ఏకరువు పెడుతూనే రైతు త్యాగాలను సర్కారు ఎరుగదే? అంటూ ప్రశ్నించారు. అవకతవకల చట్టానికి నిరసనలు తెల్పుదా మంటూ పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

కొన్ని కొన్ని కవితల్లో సూక్తులు వల్లించినట్లుగా రాసుకొచ్చారు. నీ మదిలోనే దేవుడుండగా గుడివెళ్లుట మరీ దండగా, తెలియనోళ్లతో స్నేహం చేయకు, ఇంటికొచ్చి స్నానం చేయకు. ధైర్యవే ప్రతిజీవికి దేవుడిచ్చిన వరం, భక్తులు బాగుంటేనే దేవునికి సేవలు, మనుషులం మనం చెడుకు దూరముందాం, నీతినిజాయితీ సత్యం ధర్మం పాటిద్దాం, నిదురలేనిది లేదు జీవితం అదే ప్రాణకోటికి జీవాధారం వంటివి కోకొల్లలుగా వీరి రచనల్లో కనిపిస్తాయి. ఇక, లంచ గొండి నాయకులు రాజులాయినే, బీదవాని నోట్లో మట్టిబడినే, కాళ్లు అరిగిన చెయ్యితడవంది ఫైలుక దలదాయే. కాగితాలపై కాకిలెక్కలు, అడవి మాయమాయే స్మగ్లర్లు దొరలాయే, నిజాయితీ పడుకున్నది అబద్ధం ఆడుతున్నది, నిజాయితీ ఒక్కటే అబద్ధమాడదు ఎప్పుడు, అంటూ కవితల్లో ధ్వజమెత్తారు, అన్యాయాలూ అక్రమాలపై, చివరిదాకా ఇలాగే నినాదాలతోనూ, నిలువరిస్తూనో, ప్రశ్నిస్తూనో కనబడ్డారు ఈ సమకాలీన కవి. ప్రభుత్వ ఉద్యోగాల్లో వుంటూనే గతంలో ప్రభుత్వాలను నిలదీసిన ఎందరో విరసం కవులకు ఏమాత్రం తీసిపోడు ఈ కమ్మల నర్సిములు.




ప్రతులకు: కె. రవీందర్
ఇ.నెం. 3-188/7,
టైలర్స్ కాలనీ,
ఆదిలాబాద్
సెల్: 9490561727



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి,
సెల్: 99490 92761

# తెలుగు ఉపాధ్యాయుల 'తెలుగువీర' శతకం

నిజామాబాద్ జిల్లా ముబారక్ నగర్ పాఠశాలల సముదాయపు తెలుగు ఉపాధ్యాయులు డా॥ కాసర్ల నరేశ్‌రావు సంపాదకత్వంలో, తెలుగువీర శతకం రావడం అభినందనీయం. తెలుగును తరగతి గదులలో శ్రద్ధాసక్తులతో బోధించే ఉపాధ్యాయులు, మాతృభాషపట్ల బాల బాలికలకు ప్రేమాభిమానాలు, ఆచరణ కల్గించే ప్రేరణగా శతక పద్యాలు వెలువరించడం హర్షించ దగ్గ సాహితీ వికాస పరిణామం. అందులో 18మంది కవయిత్రులు, 10మంది కవులు **'తెలిసి నడుచుకొను మా తెలుగు వీర!'** మకుటంతో రాసిన 124 పద్యాలు బాలిబాలికలకు స్ఫూర్తిదాయకంగా వున్నాయి. పద్యాలన్నీ సరళ సుందరంగా ప్రస్తుత విద్యార్థిలోకాన్ని దృష్టిలో పెట్టుకొని సమయపాలన, సహనసౌశీల్య ప్రాధాన్యత, సేవాధర్మం, ప్రబోధాల దుష్ఫలితాలు, తెలుగు భాష ఔన్నత్యం సామాజిక హితవు కల్గించే శ్రేయస్సు కోసం సందేశాత్మకంగా రాసారు.

**"కాలగతిని జూసి క్రమముగా నడువాలి"**- డా॥ కాసర్ల,

**"బాట మంచిదైన ఓటమన్నది లేదు"**- చింతల,

**"తెలుగు ఘనత చాటు తెలుగువాడ"**- తిరునగరి,

**"ప్రియము జరుగు నీకు ప్రేమగా మాట్లాడ"**- అరుణ్‌కుమార్ శర్మ, **"సంగనియుతి గాంచి సాగవలయానంచు"**- పద్మజారాణి, **"సెల్లుఫోనుకన్న మిన్న పొత్త మౌను"**- సంధ్యారాణి

**"నాల్కమీద మాటె నడయాడు దైవంబు"**- రాజమణి

**"మానవత్వమెపుడు మార్గమ్ము జూపించు'** స్వర్ణసమత

**"కన్నతల్లి పేర్మికల కాలముండనీ"**- శశిరేఖ, **"చెంతయు చరవాణి చెలగియున్న"**- సునితకుమారి, **"తెలుగు భాష ఘనత వెలుగుల గుర్తించి"**- ఇందిర, **"కురియు వాన విలువ మరియు చిన్కుకు లేదు"**- రవీందర్, **"చదువులొకటె మార్గమది నీవు మరువకు"**- దేవన్న **"కష్టపడిన చాలు కాని కార్యము లేదు''- భాగ్యరేఖ, కపటి వద్ద నున్న కలలిమి ప్రమాదమే"**-అనూజ, **"జ్ఞానమొంది నీవు జ్ఞానివగుచు''**- సునంద, పట్టుతోడ చదువు ప్రగతి వెంట నడువ'- శశికళ, **"గురువు దండనట్లె తరుము చెడులనెన్నో"**- సుధాకర్ రెడ్డి




ప్రతులకు:
డా॥కాసర్ల నరేష్‌రావు
10-14-1870/1
సీతారాంనగర్ కాలనీ
నిజామాబాద్-503 001
సెల్: 94414 06252

**"సంపదాపదలను సమముగ నెంచాలి"**- గంగాధర్, **విద్యలేని ప్రగతి వేదనల మిగుల్చు''**- సుమలత, **"చదువు నావయేచు చక్కగా దాటించు"**- రత్నమాల, **"తరువులన్ని మనకు తరగని సంపదల్**- కృష్ణవేణి

**"నేలవిడిచి సాము తెలిపోవు కదరా!**- రాణీభాగ్యరాజ్, **"ఇష్టమైన చదువు ఇంటికే వెలుగిచ్చు**- డా॥దస్తగిరి, **"తెలుగుభాష యెపుడు వెలుగుచుండు ననుచు"**- పద్మావతి, **"చదువు మార్గమొకటె చక్కని సాధనమ్"**- వాణి-జె,

**"తేనెలొల్కుతీపి తెలుగు భాష మనది**- వాణిశ్రీ

**"తెలుగు భాష మనది తెలుసుకో ఛాత్రుడా!**

**తెలుగు భాష మనకు వెలుగు నిచ్చు**

**తెగువ చూపి చాటు తెలుగు ఘనత నీవు**

**తెలిసి నడుచుకొనుము తెలుగు వీర!**- అంజయ్య

తెలుగు ఉపాధ్యాయుల పద్య సంకలనం ప్రస్తుత తెలంగాణ సాహితీసీమలో వెల్లివిరుస్తున్న భాష, భావ చైతన్యానికి నిదర్శనం. ఉపాధ్యాయులు అభినందనీయులు.



-జయసూర్య
సెల్: 9440664610

## నవ షట్పదులు

ఏ 'వార్డు'ను పరిశీలించినా
అవార్డుల్ని కొనుక్కోవడమే!
ఏ పార్టీని పరిశోధించినా
పదవులకై కొట్టుకోవడమే!
ఏ రాష్ట్రాన్ని పర్యవేక్షించినా
పేదలు బాధల్ని తట్టుకోవడమే!

తొలి తోలు బొమ్మలాటల్ని
పక్కకు తోసింది నాటకమే!
క్రమక్రమంగా రంగస్థలాన్నీ
కరిచి వేసింది సినీకీటకమే!
అన్ని రంగాల్నీ ఆటాడిస్తూ
అణచి పెట్టింది రాజకీయ రాక్షసమే!



- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

